క్లుప్తంగా

రహదారి విస్తరణ పనులు అడ్డగింత


కాలనీవాసులకు సర్ది చెబుతున్న ఎంపీడీఓ పోలప్ప

కదిరి అర్బన్: గట్ల వద్ద కదిరి– గోరంట్ల రహదారి విస్తరణ పనులను సోమవారం కందికుంట కాలనీవాసులు అడ్డుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన రహదారి నుంచి తమ కాలనీకి వెళ్లే తారురోడ్డు రోడ్డు విస్తరణలో పోతోందని గుట్టపై ఉన్న కాలనీకి వెళ్లేందుకు ఆ దారే తమకు ఆధారమన్నారు. కాలనీలో సుమారు 400 కుటుంబాలు జీవనం ఉన్నాయని, అందులో 1000 మంది దాకా నివసిస్తున్నారన్నారు. రోడ్డు విస్తరణలో కాలనీ వద్ద రోడ్డు ఎక్కువ పల్లం చేశారన్నారు. తమకు టిడ్కో అపార్ట్‌మెంట్ ముందు నుంచి తారురోడ్డు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉంటుందన్నారు. సంఘటనా స్థలానికి ఎంపీడీఓ పోలప్ప చేరుకుని ఇంజినీర్లతో మాట్లాడారు. కాలనీకి ఖచ్చితంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

చట్టాలపై అవగాహన అవసరం

చెన్నేకొత్తపల్లి: ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. దీని ద్వారా కొంత వరకు గృహ హింస నుంచి రక్షణ పొందే అవకాశం ఉంటుందని టింబక్ట్ కలెక్టివ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదిశక్తి సొసైటీ సీఈఓ కవిత సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో ఉచిత న్యాయ సేవా సదస్సు నిర్వహించారు. సొసైటీ అధ్యక్షురాలు అశ్వర్థమ్మ, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ గౌరి, సిబ్బంది పావని, రవళి, రమీజ, జ్ఞానేశ్వరి పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి


ఆర్డీఓకు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ధర్మవరం: ప్రభుత్వ పాఠశాలల శానిటరీ వర్కర్ల పెండింగ్ వేతనాలను చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ జేవీ రమణ, కో–కన్వీనర్లు అయూబ్‌ఖాన్, ఆదినారాయణ కోరారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ఆర్డీఓ మహేష్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శానిటరీ వర్కర్లకు కేవలం రూ.6 వేలు మాత్రమే వేతనాలు ఇస్తున్నారని, అది కూడా నాలుగునెలలైనా ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. యూనియన్ అధ్యక్షురాలు నాగవేణి, కార్యదర్శి లక్ష్మీదేవి, నేతలు చౌడమ్మ, జయమ్మ, అంజనమ్మ, వరలక్ష్మి, ఫరానా కార్మికులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత


మాట్లాడుతున్న పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు

ధర్మవరం రూరల్: ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పిరమిడ్ ఆధ్యాత్మిక జ్ఞాన మందిరం నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం ధ్యాన గురువు సుభాష్ పత్రీజీ జయంతి సందర్భంగా పట్టణంలోని ఆరు పిరమిడ్ కేంద్రాల్లోని వెయ్యి మంది ధ్యానులు పట్టణంలో శాఖాహార ర్యాలీ నిర్వహించారు. అనంతరం పిరమిడ్ కేంద్రం నిర్వాహకులు మాట్లాడుతూ పత్రీజీ 30 ఏళ్లపాటు ధ్యాన ప్రచారం చేసి లక్షలాది మందికి ధ్యాన రూపంలో ముక్తిని కలిగించారన్నారు. ఈ సందర్భంగా అన్నదానం చేశారు.

స్థలం కేటాయించండి

నల్లమాడ: మండల కేంద్రంలో డంపింగ్ యార్డుకు ఊరికి దూరంగా స్థలం కేటాయించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యదర్శి గంగాధర్ తహసీల్దార్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. అలాగే మండల కేంద్రంలో శ్మశాన వాటిక లేకపోవడంతో వంకల్లో, వాగుల్లో దహన సంస్కారాలు చేస్తున్నరని, ప్రభుత్వం వెంటనే స్పందించి స్థలం కేటాయించాలని కోరారు. నాయకులు మగ్గం చంద్ర, వెంకటయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట


రక్షణ కోరుతున్న ప్రేమజంట

ముదిగుబ్బ: తమకు రక్షణ కల్పించాలని ఓ ప్రేమజంట సోమవారం పోలీసులను ఆశ్రయించింది. వైఎస్సార్ జిల్లా ముద్దనూరు మండలం గంగాదేవిపల్లికి చెందిన శివవాణి, ముదిగుబ్బ మండలం యాకర్లకుంటపల్లికి చెందిన అనిల్‌కుమార్ ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరి పెళ్లి ఇరువురి కుటుంబాల వారికి ఇష్టం లేదు. తాము మేజర్లం కావడంతో పెళ్లి చేసుకున్నామని, రక్షణ కల్పించాలని పోలీసులను కోరారు.

శివాలయాలు.. ఆధ్యాత్మిక ధామాలు

- ఒక్కో ఆలయానికి ఒక్కో చరిత్ర
- భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న శివయ్య
- ఆలయాల్లో ఘనంగా కార్తీక పూజలు

ధర్మవరం అర్బన్: ధర్మవరం నియోజకవర్గంలోని శివాలయాలు ఆధ్యాత్మిక ధామాలుగా నిలుస్తున్నాయి. నిత్యపూజలు, శివనామస్మరణతో మార్మోగుతున్నాయి. ధర్మవరం చెరువుకట్ట వద్ద కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథస్వామి ఆలయం, బత్తలపల్లి మండలం సంఘశ్వేర క్షేత్రం, సంజీవపురం వద్దనున్న కాటికోటేశ్వరస్వామి క్షేత్రం, తాడిమర్రి మండలం చిల్లవారిపల్లి వద్దనున్న కాటికోటేశ్వరస్వామి క్షేత్రం ఎంతో ప్రసిద్ధిగాంచాయి. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని పెద్దసంఖ్యలో భక్తులు ఈ ఆలయాలను దర్శించుకుని పూజలు నిర్వహిస్తున్నారు

శతాబ్దాల చరిత్ర..

ధర్మవరం చెరువుకట్ట వద్ద వెలసిన కాశీ విశాలాక్షి సహిత కాశీ విశ్వనాథస్వామి ఆలయానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. క్రీ.పూ. 1370కు పూర్వం మైసూర్ రాజ్యం వడియార్ రాజుల పాలనలో ఉండేది. వీరి దేశాయి వెంకట సుబ్బారావు పెద్ద కుమారుడైన దేశాయి నారాయణరావు వీరి సామంతరాజుగా బీజాపూర్‌లో ఉండేవారు. బ్రిటిష్ వారు ఆయన్ను చంపి బీజాపూర్ కోటను ఆక్రమించారు. తర్వాత కాలంలో దేశాయి వారు ధర్మవరంలో స్థిరపడ్డారు. ఈక్రమంలో బీజాపూర్ కోటలో ప్రతిష్ఠించిన మరకత లింగాన్ని తీసుకొచ్చి ధర్మవరంలోని కోట చిన్న బురుజు వద్ద ప్రతిష్ఠించారు. తర్వాత వడియార్ రాజు ఆలయాన్ని నిర్మించారు. ఒక గదిలో వినాయకుడు, సుబ్రమణ్యేశ్వరస్వామి, రెండో గదిలో మరకత లింగం, మూడో గదిలో దేశాయిల వంశీకులు కాశీ నుంచి తీసుకొచ్చిన స్పటిక లింగం, నాల్గవ గదిలో కాశీవిశాలాక్షిదేవి అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆలయంలో నిత్యపూజలు జరుగుతున్నాయి.

దక్షిణ కాశీ..కాటికోటేశ్వర క్షేత్రం

తాడిమర్రి మండల కేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న కాటికోటేశ్వర క్షేత్రం దక్షిణ కాశీగా విరాజిల్లుతోంది. ఆలయంలోని కాటి కోటేశ్వరస్వామిని కొలిచిన వారికి కొంగు బంగారం నిలుస్తాడని భక్తుల నమ్మకం. ఇక్కడ కొండపై గుహలో వెలసిన అక్కమ్మగారు దేవతలు, కాశీ శివ లింగం, సంతానసాఫల్య వృక్షం, నవగ్రహాలు, గదాగుండం ఇక్కడ ప్రత్యేకత. ఆలయంలో ఏటా మహాశివరాత్రి పర్వదినాన అంగరంగ వైభవంగా జాతర నిర్వహిస్తారు. అలాగే ప్రతి ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తుతారు. ఇక మాఘవాసం, కార్తీక మాసాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటుంది. రెండు కొండల మధ్య అందమైన ప్రకృతిలో ఆహ్లాదకరమైన వాతావరణంలో వెలసిన కాటికోటేశ్వర స్వామి భక్తులను విశేషంగా ఆకర్షిస్తోంది.


చిల్లవారిపల్లిలోని కాటికోటేశ్వర క్షేత్రం(ఇన్‌సెట్‌లో) ధర్మవరంలోని కాశీ విశ్వనాథస్వామి మూలవిరాట్


ఆలయ ప్రాశస్త్యం:

కాటికోటేశ్వర క్షేత్రానికి వందల ఏళ్ల చరిత్ర ఉంది. పూర్వం జానగానోళ్లు (కురుబలు), చిల్లావాల్లు (బోయలు) గంగిరెడ్లు(కాపులు) మూడు సామాజిక వర్గాల కులదైవం కాటికోటేశ్వరుడు. వారిది ఒంగోలు జిల్లా మార్కాపురం దగ్గర ఒక కుగ్రామం. వారు పాడిపశువులతో జీవనం సాగించేవారు. అక్కడ కరువు రావడంతో ఈ ప్రాంతానికి వచ్చి చిత్రావతి సమీపంలో జీవించేవారు. వారు పార్నపల్లి రాజు కోనేటిరాయుడునిని యుద్ధంలో ఓడించారు. తిరిగి తమ ప్రాంతానికి పోతున్న తరుణంలో వారి ఇలవేల్పు కాటమయ్య వారితోపాటు గుర్రంపై బయలుదేరాడు. ఆయన ప్రయాణిస్తున్న గుర్రం కొండమీద నుండి కిందకు, అక్కడ నుంచి మరొక కొండ గుహలోకి గెంతింది. దీంతో గుహలో తపస్సు చేస్తున్న మునులు కోపంతో ఇక్కడే శిలవైపో అని శపించారు. దీంతో కాటికోటేశ్వరుడు శిలగా మారడంతో వారు అక్కడ ఆలయం నిర్మించి పూజలు చేస్తూ వచ్చారు. కొండపైన ఉన్న గుహ నుంచి తిరుపతి వరకు దారి ఉందని ప్రతీతి.

సర్వదేవతల సంగమం.. సంగమేశ్వరం

బత్తలపల్లి మండలం అప్రాచ్చెరువు పంచాయతీలోని ఈక్షేత్రం వివిధ ఆలయాలతో నిండిపోవడంతో సంగమేశ్వరంగా పిలువబడుతోంది. ఇక్కడ చిత్రావతి, దూబిలేరు, పాలేరు నదులు కలుస్తాయి. సంగమేశ్వరంలోని ఈశ్వరాలయానికి కొన్ని చారిత్రాత్మక ఆధారాలున్నాయి. శ్రీకృష్ణదేవరాయలు పరిపాలనా సమయంలో ఆస్థాన మంత్రికి భరణంగా ఇచ్చి అప్పాజీ పేరుతో అప్పరాజుచెర్ల గ్రామాన్ని నిర్మించినట్లు చరిత్ర చెబుతోంది. ఇక బత్తలపల్లి మండలం సంజీవపురం వద్దనున్న కాటి కోటేశ్వర క్షేత్రం భక్తుల కొంగుబంగారంగా నిలుస్తోంది. ఇక్కడ కాటమయ్య స్వామికి భక్తులు నిత్యపూజలు చేస్తుంటారు.

గదా గుండం


తాడిమర్రి కాటికోటేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న గదా గుండం కోనేరు

కాటకోటేశ్వర క్షేత్రంలో వెలసిన గదాగుండం (సెలయేరు)లో స్నానాలు చేస్తే సకల రోగాలు, సకల పాపాలు హరిస్తాయని పురాణాలు చెబుతున్నాయి. భక్తులు గదాగుండంలో స్నానాలు చేసి దేవున్ని దర్శించుకుంటారు. పూర్వం పాండవుల అరణ్యవాసంలో ఈ ప్రాంతానికి వచ్చారు. తాగునీటి కోసం ఎంత వెతికినా ఎక్కడా చుక్కనీరు కూడా కనిపించలేదు. దీంతో భీముడు కోపంతో భూమిపై గదతో కొట్టగా కొలను ఏర్పడి నీరు వచ్చిందని, దాన్నే గదాగుండం అంటారని పూర్వీకులు చెబుతారు. ఇక కాటికోటేశ్వర క్షేత్రంలో కాకులు మచ్చుకైనా కనపడవు. అందుకే ఈ కోనేటిలోని నీటిని కాకి ముట్టని తీర్థం అంటారు. పూర్వం గుహలో గల అక్కమ్మగారు దేవతలు కోనేటిలో జలకాలు ఆడుతుండగా కాకులు వారి వస్త్రాలపై రెట్టలు వేశాయని దీంతో వారు కాకులు ఆ ప్రాంతంలో ఉండకుండా శపించినట్లు పెద్దలు చెబుతారు.


సంగమేశ్వరంలో వెలసిన శివుడు

మద్యం బాటిళ్ల పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లతో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు

కనగానపల్లి: గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాపులపై సోమవారం ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. దాదులూరు గ్రామంలో అక్రమంగా నిల్వ ఉంచిన 16 రాయల్ స్ట్రీట్ విస్కీ బాటిళ్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీటిని విక్రయిస్తున్న మాధవి అనే మహిళను అదుపులోకి తీసుకుని చెన్నేకొత్తపల్లి ఎక్సైజ్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం మద్యం బాటిళ్లను సీజ్‌చేసి, మహిళపై కేసు నమోదు చేశారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్లు అలీబాగ్, ఫరూక్, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టల్ స్కీంలపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్

బత్తలపల్లి: పోస్టల్ స్కీములపై గ్రామీణ ప్రజలకు అవగాహన కల్పించాలని హిందూపురం పోస్టల్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలో పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ, పీఓఎస్‌బీ స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా పోస్టల్ సిబ్బంది, ఆర్‌డీ ఏజెంట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్‌పీఎం కమ్మన్న, శివ, గిరీష్, ఎంఓ బుద్దన్న, ప్రకాష్, పోస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

డ్రాయింగ్ ఉపాధ్యాయుడికి విశిష్ట గౌరవం


ఉపాధ్యాయుడు శ్రీరాములును సత్కరిస్తున్న గౌరవ అతిథులు

రామగిరి: మండలంలోని పేరూరు డ్యాంలో ఉన్న ఏపీ ఆర్ఎస్ (బీసీ, బాలుర) పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న డ్రాయింగ్ టీచర్ శ్రీరాములుకు ఆర్ట్‌ఆఫ్‌ఏపీ పుస్తకంలో చోటు దక్కింది. ఇటీవల విజయవాడలోని ఏపీ టూరిజం హరితబేరం పార్కులో పుస్తక ప్రదర్శన నిర్వహించారు. విజయవాడకు చెందిన అంతర్జాల పత్రిక 64 కళల డాట్ కామ్ వ్యవస్థాపకుడు కళాసాగర్.. 300 మంది ప్రతిభావంతులైన చిత్రకళాకారులతో ఆర్ట్‌ఆఫ్‌ఏపీ పుస్తకాన్ని రూపొందించారు. ఇందులో డ్రాయింగ్ ఉపాధ్యాయుడు శ్రీరాములుకు చోటు దక్కింది. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, పద్మశ్రీ అవార్డు గ్రహీత సీవీ రాజు తదితరులు చిత్ర కళాకారులను సన్మానించారు.

'నీ తాటాకు చప్పళ్లకు బెదరం'

- కందికుంటపై పూల శ్రీనివాసరెడ్డి ఫైర్


పూల శ్రీనివాసరెడ్డి

కదిరి: 'ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ ఐదుసార్లు పోటీ చేసి రెండు సార్లు మాత్రమే గెలిచారు. 2009 ఎన్నికల్లో ప్రజారాజ్యం తరపున డా.సిద్దారెడ్డి అప్పట్లో కాంగ్రెస్ ఓట్లను చీల్చడంతో కందికుంట అప్పట్లో గెలిచాడు. 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేనతో పాటు సిట్టింగ్ ఎమ్మెల్యే సహకరిస్తేనే గెలవగలిగాడు. అలాంటి వ్యక్తి తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్‌ను విమర్శించడాన్ని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారు. ఆయన తాటాకు చప్పుళ్లకు నేను కాదు కదా..మా పార్టీ కార్యకర్త కూడా బెదరడు' అంటూ వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. సోమవారం ఆయన తన స్వగృహంలో విలేకరులతో మాట్లాడారు. తనకు 60 ఎకరాలకు పైగా ఆస్తి ఉందని, వ్యాపారాలున్నాయని, ఆ డబ్బుతో కదిరిలో ప్రజలకు తన వంతు సేవ చేస్తున్నాన్నారు. తన ఆదాయమేంటో కందికుట కదిరి ప్రజలకు వివరిస్తే బాగుంటుదన్నారు. కందికుంట కబ్జాలపై మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవా చేశారు. క్రిష్టియన్, ముస్లిం మైనార్టీలకు చెందిన ఆస్తులు కబ్జా చేసింది ఎవరో కదిరి ప్రజలకు బాగా తెలుసన్నారు. ఇక్కడి ప్రజలు శాంతిని కోరుకుంటారని, రౌడీయిజం, గూండాయిజం చేయాలని చూస్తే ఊరుకోరని, సరైన సమయంలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

నీలాగా సొంత పార్టీ వాళ్లపై చెప్పులు వేయించలేదు

'2014 నుంచి మా అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాకు కదిరిలో కొన్ని సమీకరణల్లో భాగంగా ఎమ్మెల్యే టికెట్ ఇవ్వకపోయినప్పటికీ నేను మా పార్టీ అభ్యర్థి గెలుపుకోసం పని చేస్తూనే ఉన్నాను. నీలాగా 2004లో ఎమ్మెల్యే టికెట్ దక్కలేదని సొంత పార్టీ నేతలపై చెప్పులు వేయించలేదు. రెబల్‌గా అభ్యర్థిగా బరిలోకి దిగి పార్టీకి ద్రోహం చేయలేదు' అని పూల శ్రీనివాసరెడ్డి గుర్తు చేశారు. తనను కందికుంట పేపర్ జోకర్, వడ్డీ వ్యాపారి అని విమర్శించారని, ఆయన కన్నా పేపర్ జోకర్ ఇంకెవరున్నారని ప్రశ్నించారు. రైతు భరోసా పథకానికి అన్నదాత సుఖీభవ అని చంద్రబాబు పేరు మార్చారే కానీ ఇప్పటి దాకా రైతుల ఖాతాల్లో ఒక్క రూపాయి కూడా జమచేయలేదన్నారు. అలాగే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయడం లేదన్నారు. కూటమి ప్రభుత్వానికి ఎన్నికల హామీలు నెరవేర్చేందుకు ఇంకొంత సమయం ఇస్తున్నామని, ఆ తర్వాత ప్రజల తరఫున రాజీలేని పోరాటాలు చేస్తామన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

ధర్మవరం అర్బన్: అక్రమంగా మద్యం, నాటుసారా విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ చంద్రమణి తెలిపారు. తాడిమర్రి మండలం చిల్లకొండయ్యపల్లిలో ఒకరిని అరెస్టు చేసి 20 ఆంధ్ర మద్యం బాటిళ్ల, బత్తలపల్లి మండలం రామాపురం బస్టాప్ వద్ద ఒకరిని అరెస్టు చేసి అతని వద్ద 2 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, చాంద్‌బాషా సిబ్బంది పాల్గొన్నారాని తెలిపారు.

కదిరి: వరిగిరెడ్డిపల్లి క్రాస్ వద్ద సోమవారం సుబ్బులు అనే ఓ మహిళ అక్రమంగా మద్యం తరలిస్తూ ఎక్సైజ్ పోలీసులకు పట్టుబడింది. ఆమె నుంచి ప్రభుత్వానికి ఎటువంటి సుంకం చెల్లించని 48 బ్రాందీ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ వీరారెడ్డి తెలిపారు.

నేటి నుంచి పీజీఆర్ఎస్ గ్రామసభలు

కనగానపల్లి: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా మంగళవారం నుంచి గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ జీ.వీ.ప్రసాద్ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామాల్లో ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులతో కలసి గ్రామ సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఈనెల 12న ముక్తాపురం, 13న దాదులూరు, 14న కనగానపల్లి, 15న ముత్తువకుంట్ల, 19న నరసంపల్లి, 20న యలకుంట్ల, 21న తూంచర్ల, 22న తగరకుంట, 26న మద్దెలచెరువు, 27న కేఎస్ పాళ్యం గ్రామ సభలు జరుగుతాయన్నారు.

విద్యతోనే సమాజంలో గౌరవం


మాట్లాడుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ త్రివేణి

ధర్మవరం అర్బన్: విద్య ద్వారానే సమాజంలో గౌరవం లభిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ త్రివేణి తెలిపారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ దేశానికి చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ గోపాల్‌నాయక్, అధ్యాపకులు షమీవుల్లా, చిట్టెమ్మ, భువనేశ్వరి, కిరణ్‌కుమార్, సరస్వతి, మీనా, ఆనంద్, హైమావతి పాల్గొన్నారు. ఇదిలా ఉండగా లోనికోట ప్రభుత్వ మున్సిపల్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో మౌలానా అబుల్ కలామ్ ఆజాద్ జయంతి సందర్భంగా మైనార్టీ సంక్షేమ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముస్లిం మైనార్టీ డెవలప్‌మెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ రోషన్ జమీర్, నియోజకవర్గ అధ్యక్షుడు సయ్యద్ దాదాపీర్, నగర అధ్యక్షుడు ముల్లా ఫారూఖ్ విద్యార్థులతో కేక్ కట్ చేయించారు. మదీనా మసీదు కమిటీ సభ్యులు ఇనాయతుల్లా, షామీర్, ఇలియాజ్, జిక్రియా, ఖాదర్‌వలి, అప్సర్ పాల్గొన్నారు.

ముదిగుబ్బ: దేశ తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితం ఆదర్శనీయమని ముస్లీం సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఖలందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ముస్లిం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించి బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈఓ రమణప్ప, కేజీబీవీ ఎస్ఓ ఫక్రుబీ, డాక్టర్ ఇందుకూరి బాషా, కోఆప్షన్ సభ్యులు జీసీ బాలమని పాల్గొన్నారు. ఇదిలా ఉండగా స్థానిక ఎమ్మార్సీలో జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అరుణాదేవిని ఎంఈఓ రమణప్ప, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు పక్కృద్దీన్, ఈశ్వరయ్య, సత్యనారాయణ, నారాయణ, రఫీ, మదన్, అనుపమ, అనసూయ తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి: బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మౌలానా అబ్దుల్ కలామ్ ఆజాద్ జయంతి వేడుకలను పురస్కరించుకొని జాతీయ విద్యా దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు ఆజాద్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఆజాద్ దేశానికి చేసిన సేవలను కొనియాడారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి


కనగానపల్లిలో తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

కనగానపల్లి: కూటమి ప్రభుత్వం రైతులకు రూ.20 వేల పెట్టుబడి సాయం వెంటనే అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ డిమాండ్ చేశారు. సోమవారం ఏపీ రైతు సంఘం నాయకులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఇన్‌చార్జ్ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం నాయకులు మల్లికార్జున, బాలరాజు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసుకునే రైతులకు పెట్టుబడి సాయం అందించాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మహదేవ కోరారు. సోమవారం తహసీల్దార్ సురేష్‌కుమార్‌కు రైతులతో కలిసి వినతిపత్రం అందజేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేట్ పరం కాకుండా కేంద్రం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలన్నారు. కార్యక్రమంలో మండల రైతు సంఘం మండల కార్యదర్శి ముత్యాలప్ప, రామగిరి మండల కార్యదర్శి ముత్యాలు, నాగరాజు, రాము పాల్గొన్నారు.

బత్తలపల్లి: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని ఏపీ రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ఏపీ రైతు సంఘం నాయకులు నిరసన తెలిపారు. ఏపీ రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, మండలాధ్యక్షులు సత్యప్ప, రామకృష్ణ, మండల సహాయ కార్యదర్శులు రాందాసు, నారాయణస్వామి, మారెక్క, పాల్గొన్నారు.

తనకల్లు: మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన చేశారు. కౌలు రైతుల సంఘం జిల్లా నేతలు చౌడప్పయాదవ్, నాయకులు వేమన్న, రామయ్య, సోమశేఖర్, ఇర్ఫాన్ పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తన వేరుశనగ

చెన్నేకొత్తపల్లి: మండల వ్యాప్తంగా రబీలో వేరుశనగ సాగు చేసుకొనే రైతులకు సబ్సిడీపై విత్తనకాయలు అందజేయనున్నట్లు ఏఓ ఉదయ్‌కుమార్ సోమవారం తెలిపారు. ఒక బస్తాధర (30 కిలోలు) రూ.1,728 కాగా.. మూడు బస్తాలకు రూ.5,184 చెల్లించాలన్నారు. ఒక్కో రైతుకు మూడు బస్తాలు మాత్రమే అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు పట్టాదార్ పాస్‌బుక్కు, ఆధార్‌కార్డు, కరెంటు బిల్లుతో రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు.

శిక్షణకు హాజరు కండి

తాడిమర్రి: ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం నుంచి జరిగే శిక్షణ తరగతులకు మండలంలోని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఎంపీడీఓ వెంకట రంగారావు సోమవారం కోరారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక 2025–26పై తరగతులు ఉంటాయన్నారు.

నేటి నుంచి రెవెన్యూ గ్రామసభలు

తాడిమర్రి: మండలంలో మంగళవారం నుంచి ఈనెల 28 వరకూ రెవెన్యూ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి సోమవారం తెలిపారు. మొదటి రోజు చిల్లవారిపల్లి, 13న తిరుమలాపురం, 14న కొండమనాయుని పాళ్యం, 15న పెద్దకోట్ల, 19న కునుకుంట్ల, 20న దాడితోట, 21న చిన్న చిగుళ్లరేవు, 22న నిడిగల్లు, 26న పిన్నదరి, 27న మరవపల్లి, ఎం.అగ్రహారం, 28న తాడిమర్రి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. మండల స్థాయి అధికారులు, ఆయా గ్రామాల్లోని సచివాలయ సిబ్బంది తప్పక హాజరు కావాలన్నారు.

మేట్ల అవినీతిపై విచారణ చేపట్టాలి

తలుపుల : ఉపాధి హామీ మేట్ల అవినీతిపై విచారణ చేపట్టాలని టీడీపీ సీనియర్ నాయకులు ఎద్దుల సిద్దయ్య, భూషణ సోమవారం ఎంపీడీఏ రామానాయక్, తహసీల్దార్ రెడ్డిశేఖర్ ఫిర్యాదు చేశారు. తలుపుల పంచాయతీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విధుల్లో చేరిన మేట్లు వెంకటనారాయణ, అశోక్ ఫీల్డ్ అసిస్టెంట్‌లుగా చలామణి అవుతూ కూలీల నుంచి పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేస్తున్నారన్నారు.

సంక్షిప్త సమాచారం

ఏఈఓగా ప్రశాంతి

తనకల్లు: మండల ఏఈఓగా కే. ప్రశాంతి సోమవారం బాధ్యతలు స్వీకరించినట్లు ఏఓ శ్రీహరినాయక్ తెలిపారు. ఈమె నల్లచెరువు మండలం అగ్రహారం సచివాలయంలో వీఏఓగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి వచ్చారన్నారు.

అమరనాథరెడ్డి ఇంటికి నోటీసులు

కదిరి అర్బన్: వీరచిన్నయగారిపల్లిలో ఉన్న వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కన్వీనర్ మలక అమరనాథ్‌రెడ్డి ఇంటికి సోమవారం కృష్ణాజిల్లా అవనిగడ్డ పోలీసులు నోటీసులు అతికించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఫేస్ బుక్‌లో పోస్ట్ పెట్టాడని అమరనాథ్‌రెడ్డిపై అవనిగడ్డ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమెదు చేసిన విషయం తెలిసిందే. రెండు రోజుల నుంచి పోలీసులు అమరనాథ్‌రెడ్డిని అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. నోటీసులపై సంతకం చేయాలని అమరనాథ్ రెడ్డి తండ్రి గంగిరెడ్డిని పోలీసులు కోరగా ఆయన నిరాకరించారు. దీంతో ఇంటికి నోటీసును అతికించారు.

పంచాయతీ స్థలంలో నిర్మాణాలు చేపట్టొద్దు

ఎన్పీకుంట: పంచాయతీ స్థలంలో నిర్మాణాలు చేపట్టరాదని ఎంపీడీఓ ఆంజినప్ప హెచ్చరించారు. ఎన్.పీ.కుంట గ్రామ పొలం సర్వే నంబరు 294 లో గల పశువులమందలోని గ్రామకంఠం భూమిలో నిర్మించిన రేకులషెడ్డును ఎంపీడీఓ సోమవారం వీఆర్ఓ, సర్వేయర్లతో కలిసి పరిశీలించారు. నిర్మాణంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ పేర్కొన్నారు.

'ఉల్లాస్'పై శిక్షణ

బత్తలపల్లి: ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ నరసింహనాయుడు అధ్యక్షతన సోమవారం వలంటీర్ టీచర్స్, వీఓఏలు, సీసీలకు ఉల్లాస్ కార్యక్రమంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. తహసీల్దార్ స్వర్ణలత, ఎంఈఓ చాముండేశ్వరి మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని ప్రతి మహిళకు చదవడం, రాయడం నేర్పించాలన్నారు. వయోజన విద్య ఏపీఓ జనార్ధన్‌గౌడ్, వయోజనవిద్య పర్యవేక్షకుడు వెంకటరమణ, ఏపీఎం సుదర్శన్‌రాజు, శోభ, ఏరియా కోఆర్డినేటర్ సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కూలీ కుటుంబానికి చెక్కు అందజేత

తలుపుల: పెద్దన్నవారిపల్లికి చెందిన ఉపాధి కూలీ కుటుంబానికి సోమవారం రూ.50 వేల పరిహార చెక్కును ఎంపీడీఓ రామానాయక్, ఏపీఓ వీరారెడ్డి అందజేశారు. గతంలో ఆదినారాయణ ఉపాధి పనులు చేస్తుండగా గుండెపోటుతో మరణించాడు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

పుట్టపర్తి: ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పుట్టపర్తి మండలంలోని పలు పాఠశాలల్లో సోమవారం యూనియన్ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఉపాధ్యాయులకు నెల వారి పదోన్నతులు, పీఆర్సీ, కరువు భత్యం బకాయిలు లాంటివి వాటిని పరిష్కరించాలన్నారు. యూనియన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్‌రెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కుంట భూమి ఆక్రమణపై రైతుల నిరసన

ధర్మవరం రూరల్: కుంట భూమిని పట్టాలు చేసుకొని ఆక్రమించారని, వెంటనే పట్టాలు రద్దు చేయాలని తిప్పేపల్లి రైతులు డిమాండ్ చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతు సర్వే నంబర్ 66–1లో 18 ఎకరాలలో కుంట ఉందన్నారు. ఈ కుంట నిండితే కుంట కింద వందలాది ఎకరాల ఆయకట్టు భూముల్లో సాగులోకి వస్తాయన్నారు. నిబంధనల మేరకు కుంటలు, కుంట కాలువలు, వంకలలో ఎవరికి పట్టాలు ఇవ్వకూడదన్నారు. అలాంటిది కుంట స్థలంలో కొందరు రెవెన్యూ అధికారులు డబ్బుకు కక్కుర్తి పడి పట్టాలు ఇచ్చారన్నారు. అనంతరం పట్టాలు రద్దు చేయాలని తహసీల్దార్, ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. విచారణ చేసి తగు న్యాయం చేస్తామని వారు హామినివ్వడంతో రైతులంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కేసు నమోదు

తలుపుల : దాడి ఘటనలో పోలీసులు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. ఎస్ఐ నరసింహుడు తెలిపిన వివరాలు..సిద్దుగూరిపల్లికి చెందిన పవన్‌కుమార్‌రెడ్డి గ్రామానికి చెందిన మధుసూదన్‌రెడ్డి ట్రాక్టర్ బాడుగకు పంపలేదని ఆదివారం రాత్రి గొడవకు దిగాడు. ఈక్రమంలో ఆవేశానికి లోనై మధుసూదన్‌రెడ్డితో పాటు అతడి తండ్రి చంద్రారెడ్డి, మరోవ్యక్తి సుబ్బారెడ్డిపై వేటకొడవలితో దాడి చేశాడు. బాధితుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.